ఎట్టకేలకు మోక్షం



మూడో పట్టణ పోలీస్ స్టేషన్

- మూడో పట్టణ పోలీస్ స్టేషన్ భవనానికి మరమ్మతులు
- 'సాక్షి' వరుస కథనాలతో ప్రారంభం
- పరిశుభ్రతపై కూడా దృష్టి సారించాలంటున్న ప్రజలు


ప్రమాదకరంగా మెట్లు (ఫైల్)


మరమ్మతుల అనంతరం మెట్లు


భవనం గోడలకు మరమ్మతులు ప్రారంభం


స్టేషన్ ముఖ ద్వారం వద్ద పేరుకుపోయిన చెత్త


బురదతో నిండిపోయిన స్టేషన్ ప్రాంగణం


మూడో పట్టణ పోలీస్ స్టేషన్ భవనం గోడలపై పెరిగిన మొక్కలు (ఫైల్)

సాక్షి కథనాలతో చలనం

మూడో పట్టణ పోలీస్ స్టేషన్ శిథిల స్థితికి చేరుకుందని 9 నెలల కిందట 'సాక్షి' పత్రికలో ఓ కథనం ప్రచురితమైంది. మరుసటి రోజు స్టేషన్‌ను సందర్శించిన నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి వెంటనే మరమ్మతులు చేపట్టాలని ఆదేశించారు. అయితే వారం రోజులపాటు మరమ్మతుల కోసం హడావిడి చేసిన స్థానిక సిబ్బంది పనులు ప్రారంభించకుండా వదిలేశారు. నగర సీపీ ఆదేశించి ఎనిమిది నెలలు గడిచిపోయినా మరమ్మతులు ఒక్క అడుగూ ముందుకు కదలకపోవడంతో గత నెలలో మరోసారి 'సాక్షి'లో కథనం ప్రచురితమైంది. ఆ కథనం సీపీ బాగ్చి దృష్టికి వెళ్లడంతో మూడో పట్టణ పోలీసులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణమే మరమ్మతులు ప్రారంభించాలని ఆదేశించారు. దీంతో ప్రభుత్వ నిధులు రూ.5.5 లక్షలతో పనులు ప్రారంభించి శిథిలమైన గోడలకు ప్లాస్టింగ్, మెట్లు తొలగించి నిర్మిస్తున్నారు.

బీచ్‌రోడ్డు : ఆ స్టేషన్‌లో ఉద్యోగం చేయాలంటే భయం భయంగా ఉండేది. ఫిర్యాదు చేసేందుకు వచ్చే ప్రజలు కూడా స్టేషన్‌లో ఎక్కువ సమయం ఉంటే ఏం జరుగుతుందో అని భయపడేవారు. ముఖ్యంగా వర్షాకాలంలో అయితే పోలీసులు బిక్కుబిక్కుమంటూ విధులు నిర్వహించే వారు. పోలీసుల ఇబ్బందులు, ప్రజల భయాందోళనలపై వరుస కథనాలు 'సాక్షి' పత్రికలో ప్రచురించి సమస్యను ఉన్నాతాధికారుల దృష్టికి తీసుకెళ్లింది. దీంతో ఆ స్టేషన్ భవానానికి మోక్షం కలిగింది. అదే నగరంలో ఎంతో ప్రాముఖ్యత కలిగిన మూడో పట్టణ పోలీసు స్టేషన్. సాక్షి కథనాలతో స్టేషన్ మరమ్మతులు ప్రారంభం కావడంతో పోలీసులు, ఫిర్యాదుదారులు ఊపిరి పీల్చుకుంటున్నారు..

20 ఏళ్ల నుంచి నిర్వహణ శూన్యం

నగరానికి ఎటువంటి ప్రముఖులు వచ్చినా మూడో పట్టణ పోలీసు స్టేషన్ పరిధిలోనే ఉంటారు. అంతటి ప్రాముఖ్యత కలిగిన పోలీస్ స్టేషన్ నిర్వహణను గడిచిన 20 ఏళ్లుగా గాలికి వదిలేశారు. దీంతో భవనం శిథిల స్థితికి చేరుకోవడంతోపాటు గోడలకు మొక్కలు సైతం పుట్టుకొచ్చాయి. దీంతో గోడలకు భారీ పగుళ్లు ఏర్పడ్డాయి. ఏ క్షణంలో ఏ గోడ కూలిపోతుందో తెలియని పరిస్థితికి చేరుకున్నాయి. ఉన్నతాధికారులు స్టేషన్‌కు రావడం... చూసి వెళ్లిపోవడం తప్ప ఏనాడూ మరమ్మతుల కోసం పట్టించుకున్న దాఖాలు లేవు.

మేడపైకి వెళ్లాలంటే భయం..

మూడో పట్టణ పోలీస్ స్టేషన్ భవనంలో మేడపైన ట్రాఫిక్, క్రైమ్ విభాగాల సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. ఆ విభాగాల్లో పని చేసే వాళ్లంతా నిరంతరం బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు. పైకి వెళ్లే మెట్ల మార్గం పూర్తిగా శిథిలం కావడంతో పైకి వెళ్లడమే పెద్ద సవాల్‌గా నిలిచేది. దీంతో ముందుగా మరమ్మతులను మెట్ల నుంచే ప్రారంభించారు. మెట్లను పూర్తిగా తొలగించి మరలా నిర్మించారు. అప్పటి నుంచి ట్రాఫిక్, క్రైం విభాగాల పోలీసులు ప్రశాంతంగా మేడపైకి చేరుకుని విధులు నిర్వర్తిస

అధ్వానంగా పరిసరాలు

మూడో పట్టణ పోలీస్ స్టేషన్ ప్రాంగణంలో ద్వారక ఏసీపీ కార్యాలయం, ఎంవీపీ క్రైమ్, ట్రాఫిక్ విభాగాల సిబ్బంది కూడా విధులు నిర్వర్తిస్తుంటారు. అయితే ఏ సమయంలో చూసినా ఈ ప్రాంగణం అంతా మొత్తం చెత్తతో నిండిపోయి ఉంటుంది. అది కూడా స్టేషన్ ముఖ ద్వారం వద్ద భారీ మొత్తంలో చెత్త పేరుకుపోతుంది. మరో వైపు వర్షం కురిస్తే ప్రాంగణం మొత్తం బురదమయం అవుతుంది. దీంతో స్టేషన్ లోపలకు వెళ్లాంటే చాలా ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి ఉంటుంది. పరిసరాల పరిశుభ్రతపై కూడా పోలీసులు దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.

క్లుప్తంగా

విమ్స్ ఓపీ @ 970


విమ్స్‌లో ఓపీ కౌంటర్ల వద్ద రద్దీ

ఆరిలోవ : విశాఖ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (విమ్స్)లో రోజురోజుకూ రోగుల సంఖ్య పెరుగుతోంది. దీంతో ఓపీ వద్ద రద్దీ నెలకొంటుంది. ఓ పక్క సీజనల్ వ్యాధులు, ఆర్థోపెడిక్, ఈఎన్‌టీ సమస్యలతో రోగులు పెరుగుతున్నారు. సోమవారం ఇక్కడ 970 మంది ఓపీ నమోదు చేసుకోవడం విశేషం. కొద్ది రోజుల వరకు విమ్స్‌లో 700 నుంచి 800 మధ్యలో ఉన్న ఓపీ ఒక్కసారిగా 970కి పెరిగిపోయింది. వాటిలో అత్యధికంగా ఆర్థోపెడిక్ విభాగానికి 150 మంది రాగా, జనరల్ మెడిసిన్ సమస్యలతో 145 మంది, జనరల్ సర్జరీ విభాగంలో 99 మంది ఓపీ నమోదైంది. మొత్తం ఓపీలో సూపర్ స్పెషాలిటీ విభాగాల్లో 317 మంది, స్పెషాలిటీ విభాగాల్లో 653 మంది నమోదైనట్లు విమ్స్ వైద్యులు తెలిపారు.

వైద్యులు అందుబాటులో లేక అవస్థలు

ఇదిలా ఉండగా ఓపీకి తగినట్లు వైద్యులు విమ్స్‌లో అందుబాటులో ఉండటం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇక్కడ వైద్యులు ఎక్కువ మంది ఎప్పుడు వస్తారో, వచ్చిన వైద్యుడు ఎంతసేపు ఓపీ చూస్తారో తెలియని పరిస్థితి నెలకొంది. ఇక్కడ వైద్యులు ఎక్కువ సమయం క్యాంటీన్‌లో గడుపుతున్నట్లు రోగుల బంధువులు ఆరోపిస్తున్నారు. దీనివల్ల గంటల తరబడి వైద్యుల కన్సెల్టెన్సీల గదుల వద్ద ఎదురు చూడాల్సి వస్తోందని రోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడ సరైన పర్యవేక్షణ లేకపోవడం వల్లే వైద్యులు నిర్లక్ష్యంతో వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ప్రకృతి వనరుల పరిరక్షణ అందరి బాధ్యత


మొక్క నాటుతున్న సింహాచలం, విద్యార్థులు

మద్దిలపాలెం : ప్రకృతి వనరుల పరిరక్షణ అందరి బాధ్యత అని ఏయూ ఎన్‌ఎస్ఎస్ కో ఆర్డినేటర్ సింహాచలం అన్నారు. ఏయూ ఫైన్ ఆర్ట్స్ డిపార్ట్‌మెంట్‌లో గ్రీన్ క్లైమేట్ టీం ఎన్జీవో నేతృత్వంలో సోమవారం మొక్కలు నాటారు. అనంతరం పక్షుల కోసం మట్టి పాత్రలో నీరు, ధాన్యపు కంకుల గుత్తులు ఏర్పాటు చేశారు. కోరమాండల్ ఫెర్టిలైజర్స్ వారి గుడ్డ సంచులు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పర్యావరణహితంగా జీవించాలని సూచించారు. గ్రీన్ క్లైమేట్ టీం ఎన్జీవో వ్యవస్థాపక కార్యదర్శి జేవీ రత్నం, ఫ్యాకల్టీ, విద్యార్థులు పాల్గొన్నారు.

తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి

విశాఖ సిటీ: వీఎంఆర్‌డీఏ పరిధిలో వివిధ పార్కుల్లో తొలగించిన గార్డెన్ సొసైటీ కార్మికులను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని వుడా వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ ప్రతినిధులు విజ్ఞప్తి చేశారు. దీనిపై సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో కలెక్టర్ హరేందిర ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. సొసైటీలతో సంప్రదించకుండా అన్యాయంగా ఆరుగురు కార్మికులను 2024, సెప్టెంబర్ 1వ తేదీ నుంచి విధుల నుంచి నిలిపివేసినట్లు కలెక్టర్‌కు వివరించారు. 60 ఏళ్లు దాటిందన్న కారణంగా తొలగించినట్లు చెప్పారు. వీఎంఆర్‌డీఏ పరిధిలో పలు పార్కుల్లో 220 మంది పనిచేస్తున్నారని, వీరికి ఈఎస్ఐ, పీఎస్, రిటైర్మెంట్ బెనిఫిట్స్, వారాంతపు సెలవులు అమలు కావడం లేదని తెలిపారు. వీరిని తొలగించడంతో 9 నెలలుగా ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే వీరిని విధుల్లోకి తీసుకోవాలని, పనిచేసిన కాలానికి రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇప్పించాలని కలెక్టర్‌ను కోరారు.

కానిస్టేబుల్‌పై దాడికి పాల్పడిన వ్యక్తిపై కేసు

ఎంవీపీ కాలనీ : ఎంవీపీ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వర్తిస్తున్న కానిస్టేబుల్ డి.యోగేశ్వర్‌పై దాడికి పాల్పడిన యెడ్డు దేముడు అనే వ్యక్తిపై ఎంవీపీ పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ ఘటనపై పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. హెచ్‌బీ కాలనీలో దేముడు అనే వ్యక్తి సిరిల దుర్గ అనే మహిళపై దాడికి యత్నిస్తున్నట్టు 112కు కాల్ వచ్చింది. దీంతో ఎంవీపీ పోలీసులకు వచ్చిన సమాచారం మేరకు కానిస్టేబుల్ యోగేశ్వర్ సంఘటన స్థలానికి వెళ్లాడు. ఈ క్రమంలో కూరగాయల కత్తితో సిరిల దుర్గపై దేముడు దాడికి ప్రయత్నిస్తుండగా అడ్డుకున్నాడు. ఈ క్రమంలో దేముడు కానిస్టేబుల్‌పై కూడా దాడికి పాల్పడ్డాడు. కత్తితో గాయపరిచేందుకు యత్నించాడు. ఈ నేపథ్యంలో కానిస్టేబుల్ యోగేశ్వర్ ఫిర్యాదు మేరకు ఎంవీపీ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆటో డ్రైవర్లు క్రమశిక్షణతో మెలగాలి



ఆటో యూనియన్ సమావేశంలో మాట్లాడుతున్న ట్రాఫిక్ సీఐ ప్రసాద్

ఆరిలోవ : ఆటో డ్రైవర్లు క్రమశిక్షణతో మెలగాలని ట్రాఫిక్ సీఐ కె.వి.ఎన్.ప్రసాద్ సూచించారు. జిల్లా ఆటో కార్మిక సంఘం (సీఐటీయూ) మద్దిలపాలెం జోన్ ఎనిమిదో మహాసభలు సోమవారం తోటగరువు ఎర్నిదుర్గమాంబ ఆలయం ఆవరణలోని కల్యాణ మండపంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు నాణ్యమైన సేవలు అందించాలన్నారు. ట్రాఫిక్ నియమాలు పాటించాలని సూచించారు. క్రమశిక్షణ, పద్ధతులు పాటించే ఆటో డ్రైవర్లకు పోలీసుల సహాయం ఉంటుందన్నారు. యూనియన్ గౌరవ అధ్యక్షుడు బి.జగన్ మాట్లాడుతూ ఆటో కార్మికులకు గుదిబండ లాంటి రవాణా చట్ట సవరణకు కేంద్ర ప్రభుత్వం పూనుకొందన్నారు. దీనిపై ఆటో కార్మికులు పదేళ్లుగా పోరాడుతున్నారన్నారు. కేంద్రం అమలు చేస్తున్న చట్టాలు చాపకింద నీరులా ఆటో డ్రైవర్లను వేధిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఆటో కార్మికులకు పార్కింగ్ స్థలాలు కేటాయించాలని, డీజిల్, సీఎన్‌జీపై సబ్సిడీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం ఆటో కార్మిక సంఘం నూతన కమిటీని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు కె.సత్యనారాయణ, పి.రాజ్‌కుమార్, సత్యం, శంకరరావు, అప్పలరాజు, గోపి, గురుమూర్తి పాల్గొన్నారు.

27న యాదవ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు


సమావేశంలో మాట్లాడుతున్న ఉరుకూటి రాజారావు

మద్దిలపాలెం : యాదవ విద్యార్థులకు 2025 సంవత్సరానికిగాను ప్రతిభ పురస్కారాలు ఈ నెల 27న అందజేయనున్నామని యాదవ ఉద్యోగుల సంఘం (వైఈఎస్) అధ్యక్షుడు ఉరుకూటి రాజారావు తెలిపారు. ఇందుకు సంబంధించిన సమావేశం శివాజీపాలెంలోని ఓ ఫంక్షన్ హాలులో సంఘం గౌరవ అధ్యక్షుడు ప్రగడ చిన్నారావు ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజారావు మాట్లాడుతూ పదో తరగతి సీబీఎస్ఈ, ఐసీఎస్ఈలో 500 మార్కులకు పైగా సాధించిన విద్యార్థులకు, అలాగే ఇంటర్మీడియట్‌లో 900 మార్కులు పైబడిన వారికి, నీట్, ఎస్ఐటీ, ఐఐటీలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రతిభ పురస్కారాలు అందిస్తామన్నారు. ప్రతిభావంతులైన విద్యార్థుల పేర్లు ఈ నెల 21లోగా నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ నెల 27న శివాజీపాలెంలో గల సవేరా ఫంక్షన్ హాల్‌లో పురస్కారాలు అందజేస్తామని తెలిపారు. ముఖ్య అతిథులుగా పలువురు ఎమ్మెల్యేలు హాజరుకానున్నారన్నారు. సమావేశంలో సంఘం ప్రధాన కార్యదర్శి డొక్కర శ్రీనివాస్ యాదవ్, వర్కింగ్ ప్రెసిడెంట్ మట్టా సత్యనారాయణ, గౌరవ సలహాదారులు ఆచార్య పుట్టి శ్రీనివాసరావు, జగన్, మంగరాజు, ప్రకాశ్, ముగడ చంద్రశేఖర్, బందం రాజు, శ్రీధర్, శెట్టి వెంకటరమణ, ఉప్పిలి చిన్నారావు పాల్గొన్నారు.

ముంపు సమస్య తక్షణమే పరిష్కరించాలి

వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త మొల్లి అప్పారావు


ఇసుకతోటలో పరిశీలిస్తున్న వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మొల్లి అప్పారావు, తదితరులు

మద్దిలపాలెం : నగరంలో వర్షం కురిస్తే జీవీఎంసీ 16వ వార్డులోని అధిక ప్రాంతం ముంపునకు గురవుతోందని, ఇక్కడి ముంపు ప్రాంత రక్షణకు పటిష్టమైన చర్యలు చేపట్టాలని వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త మొల్లి అప్పారావు కోరారు. ఆదివారం ఆకస్మికంగా కురిసిన భారీ వర్షానికి 16వ వార్డులో ముంపునకు గురైన ప్రాంతాలను సోమవారం ఆయన పరిశీలించారు. కేఆర్ఎం కాలనీలో వర్షపు నీటి ప్రవాహం ఇళ్లలోకి వచ్చిందని తెలిసి ఆ ప్రాంతంలో జరిగిన నష్టాన్ని స్థానికులను అడిగి తెలుసుకున్నారు. అలాగే ఇసుకతోట ప్రాంతంలో ముంపునకు గురైన అంబేడ్కర్‌కాలనీ, రజక వీధి ప్రాంతాన్ని సందర్శించారు. రహదారులపై నిలిచిపోయిన నీరు, కాలువల నుంచి పైకి వచ్చిన మురుగు కారణంగా వ్యాపిస్తున్న దుర్వాసనతో కాలనీవాసులు పడుతున్న ఇబ్బందులను తెలుసుకున్నారు. వెంటనే వార్డుకు సంబంధించిన జీవీఎంసీ అధికారులతో మాట్లాడారు. ముంపు సమస్య పరిష్కారానికి త్వరితగతిన చర్యలు చేట్టాలని కోరారు. నీరు నిలిచిపోకుండా ఉండటానికి తగు చర్యలు తీసుకోవాలన్నారు. గెడ్డలు, కాలువల్లో ఎప్పటికప్పుడు పూడిక తీయించి మురుగు నీరు నిల్వ లేకుండా చూడాలని సూచించారు. మొల్లి అప్పారావుతోపాటు ఇసుకతోట, అంబేడ్కర్ కాలనీ, రజకవీధి కాలనీల అధ్యక్ష, కార్యదర్శులు, కమిటీ సభ్యులు, స్థానికులు పాల్గొన్నారు.


ఎన్‌ఎస్ఎస్ కార్యక్రమాలు విస్తృతం చేయాలి


సింహాచలంను సత్కరిస్తున్న ఎన్ఎస్ఎస్ అధికారుల బృందం

మద్దిలపాలెం : ఆంధ్ర విశ్వవిద్యాలయం పరిధిలో జాతీయ సేవా పథకం కార్యక్రమాలు విస్తృతం చేయాలని ఏయూ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కో ఆర్డినేటర్ డి.సింహాచలం సూచించారు. ఏయూలోని జాతీయ సేవా పథకం కార్యాలయంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విజయనగరం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి, విశాఖ జిల్లాల్లో గల గ్రామీణ, పట్టణ, గిరిజన ప్రాంతాల్లో నిర్వహించే సేవా కార్యక్రమాల్లో యువతను భాగస్వాములను చేయాలని సూచించారు. మై భారత్ పోర్టల్‌లో వలంటీర్లంతా పేర్లు నమోదు చేసుకునేలా చూడాలన్నారు. జూలై, ఆగస్టు నెలల్లో నూతన వలంటీర్లకు శిక్షణ కార్యక్రమాలు పూర్తి చేయాలని సూచించారు. ఈ సందర్భంగా జాతీయ సేవా పథకం జోనల్ అధికారి డాక్టర్ పి.ఉమామహేశ్వరరావు, వివిధ జిల్లాల నోడల్ అధికారులు ఇ.పి.ఎస్.భాగ్యలక్ష్మి, చంద్రశేఖర్, జి.తాతయ్య నాయుడు, గౌరీ శంకర్ తదితరులు తమ పరిధిలో చేపడుతున్న సేవా కార్యక్రమాలను వివరించారు. అనంతరం నూతనంగా బాధ్యతలు స్వీకరించిన డి.సింహాచలంను ఘనంగా సత్కరించారు.

చంద్రబాబు పాలనలో మోసపోయిన జనం

- అధికారం అండతో హత్యలు చేస్తున్న కూటమి నాయకులు
- చంద్రబాబు మోసాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి
- వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త మొల్లి అప్పారావు



సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త మొల్లి అప్పారావు

ఆరిలోవ : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వ ఏడాది పాలనలో ప్రజలను పూర్తిగా మోసగించారని వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త మొల్లి అప్పారావు ఆరోపించారు. 'బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ' కార్యక్రమం వైఎస్సార్‌సీపీ నాయకులు జీవీఎంసీ పదో వార్డులో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా స్క్రీన్‌పై ప్రదర్శించిన పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సందేశం కార్యకర్తలకు వినిపించారు. అనంతరం సమన్వయకర్త మొల్లి అప్పారావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తయినప్పటికీ ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చలేదన్నారు. ప్రజలకు మాయ మాటలు చెప్పి గద్దెనెక్కారని విమర్శించారు. మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డికి ప్రజల్లో ఆదరణ రోజురోజుకూ పెరుగుతుందన్నారు. ఈ ఆదరణ చూసి ఓర్వలేక వైఎస్సార్ సీపీ కార్యకర్తలపై పోలీసులతో తప్పుడు కేసులు పెట్టించి భయపెడుతున్నారన్నారు. చంద్రబాబునాయుడు చేసే మోసాలను ప్రజల్లోకి వైఎస్సార్‌సీపీ కార్యకర్తలంతా తీసుకెళ్లాలని కోరారు. అధికారం చేపట్టినప్పటి నుంచి కూటమి నేతలు హత్యలు, అన్యాయాలు చేస్తున్నారన్నారు. శ్రీకాళహస్తిలో జనసేన నేతలు కారు డ్రైవర్‌ను హత్య చేయించడమే దీనికి నిదర్శనమన్నారు. దీనిపై కూటమి నేతలు ఎవ్వరూ మాట్లడటం లేదన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర బీసీ సెల్ ఉపాధ్యక్షుడిగా నియమితులైన కంట్రెడ్డి రామన్నపాత్రుడు, నియోజకవర్గ మహిళా విభాగం అధ్యక్షురాలిగా నియమితులైన కె.శిరీషను మొల్లి అప్పారావు సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి పల్ల దుర్గారావు, పతివాడ కనకరాజు, వైదా నారాయణరావు, వరలక్ష్మి, తులసి, కృష్ణ, హేమంత్, గురునాయుడు, వరదరాజు, గోవింద్, వెంకటరమణ, వెంకటలక్ష్మి, నారాయణమ్మ, కాంతం, హరి, కన్నబాబు పాల్గొన్నారు.

కేంద్ర మంత్రి దృష్టికి పోర్టు కార్మికుల సమస్యలు


మంత్రికి సమస్యలు వివరిస్తున్న గంట్ల శ్రీనుబాబు

ఏయూ క్యాంపస్ : నగరానికి విచ్చేసిన కేంద్ర మంత్రి శర్బానంద్ సోనోవాల్ దృష్టికి పోర్ట్‌లో పర్మినెంట్ కాకుండా ఉన్న మేస్త్రీలు, కార్మికుల సమస్యలను విశాఖ పోర్ట్ ట్రస్ట్ సలహా మండలి కమిటీ పూర్వ సభ్యులు గంట్ల శ్రీనుబాబు తీసుకెళ్లారు. బీచ్‌రోడ్డులోని ఒక హోటల్‌లో మంత్రిని కలిసి పోర్ట్ కార్మికుల సమస్యలను వివరించారు. అనంతరం సింహాచలం శ్రీ వరాహ లక్ష్మీ నృసింహ స్వామి చందన ప్రసాదాన్ని అందించి, సత్కరించారు.

అబ్బురపరిచిన పద్యనాటక ఘట్టాలు


మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ భీమిలి సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు

మద్దిలపాలెం : పౌరాణిక, పద్యనాటక ఘట్టాలు అబ్బురపరిచాయి. విశాఖ ఉషారాణి కల్చరల్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు, ప్రముఖ పద్యనాటక కళాకారుడు, నంది పురస్కార గ్రహీత వంకాయల మారుతీ ప్రసాద్ ఆధ్వర్యంలో సోమవారం కళాభారతి ఆడిటోరియంలో కోలాహలంగా నిర్వహించారు. కిక్ బాక్సింగ్ యువ క్రీడాకారిణి వంకాయల ఉషారాణి పేరిట ఆమె తండ్రి మారుతీ ప్రసాద్ ఈ సంస్థను నెలకొల్పి సాంస్కృతిక సేవ చేస్తున్నారు. శ్రీకాకుళానికి చెందిన కళాకారులు రామాంజనేయ యుద్ధాన్ని కళ్లకు కట్టినట్టు ప్రదర్శించారు. విజయనగరానికి చెందిన హుస్సేన్, సత్యశ్రీ జంట సత్యహరిశ్చంద్రుడు నాటకంలోని కాటిసీను రసవత్తరంగా ప్రదర్శించారు. విశాఖపట్నానికి చెందిన ఎం.ఎస్.నాయుడు, మెరక సత్యనారాయణ గయోపాఖ్యానం ప్రదర్శించారు. హరిశ్చంద్రుడి అమ్మకం ఘట్టం ప్రేక్షకుల నీరాజనాలందుకుంది. విజేతలకు వైఎస్సార్ సీపీ విజయనగరం జిల్లా అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు, పైడా విద్యాసంస్థల అధినేత పైడా క్రిష్ణ ప్రసాద్ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు.

వైఎస్సార్ సీపీతోనే కళాకారులకు న్యాయం

అనంతరం మజ్జి శ్రీనివాసరావు మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే కళాకారులకు న్యాయం చేస్తామని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం కళాకారుల పట్ల వివక్ష చూపుతోందన్నారు. జీవన భృతి పెంచకుండా తాత్సారం చేస్తున్నారని మండిపడ్డారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో జీవన భృతి రూ.4 వేలు అందించామని, నేటికీ అదే మొత్తం కూటమి ప్రభుత్వం చెల్లిస్తోందన్నారు.

ఎన్నికల హామీలన్నీ విస్మరించారు


మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ సమన్వయకర్త మొల్లి అప్పారావు

మద్దిలపాలెం : జీవీఎంసీ 23వ వార్డులో వైఎస్సార్ సీపీ వార్డు అధ్యక్షుడు బూస రమణారెడ్డి అధ్యక్షతన 'బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ' కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా తూర్పు నియోజకవర్గం సమన్వయకర్త మొల్లి అప్పారావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తి చేసుకున్నప్పటికీ, వారు మేనిఫెస్టోలో చెప్పిన హామీలను విస్మరించి ప్రజలను మోసం చేశారన్నారు. ఎన్నికల ముందు కూటమి నాయకులు గడప గడపకు వెళ్లి ప్రతీ ఇంటికి సంవత్సరానికి లక్షలాది రూపాయలు బ్యాంక్ ఖాతాలో పడతాయన్నారన్నారు. దానికి ష్యూరిటీగా బాండ్లు ఇస్తున్నామని నమ్మించి ప్రజలను మోసం చేశారని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం చేసిన మోసాన్ని ఇంటింటికీ వెళ్లి తెలియజేయాలనే ఉద్దేశ్యంతో 'బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ' అనే కార్యక్రమం చేపడుతున్నామన్నారు. ఎప్పుడు ఎన్నికలు వచ్చినా కూటమి నాయకులకు బుద్ధి చెప్పే విధంగా ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో వార్డు ఇన్‌చార్జి పులగం సూర్యనారాయణ రెడ్డి, శ్రీనివాస రెడ్డి, కొండా రెడ్డి, అరుణ, ఈశ్వర రెడ్డి, బోర రమణా రెడ్డి, రమణ, మధుసూదన రెడ్డి పాల్గొన్నారు.

అతిథి అధ్యాపకుల సమస్యలు పరిష్కరించాలి

మద్దిలపాలెం : ఏయూలో పనిచేస్తున్న అతిథి అధ్యాపకులుకు న్యాయం చేయాలని ఎస్టీ కమిషన్ ఛైర్మన్ డాక్టర్ శంకరరావును ఏయూ అతిథి అధ్యాపకుల సంఘం అధ్యక్షుడు సురేష్ మీనన్ కోరారు. ఏయూ లో సోమవారం నిర్వహించిన ఎస్టీ అభ్యర్థుల రివ్యూ మీటింగ్‌కు హాజరైన శంకరరావుకు అతిథి ఉపాధ్యాయులకు జరిగిన అన్యాయాన్ని వివరించి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఏయూ అధ్యాపకుల రెన్యువల్ ప్రక్రియ వివాదాన్ని వివరించారు. కొత్త వారికి ఇంటర్వ్యూలు నిర్వహించుకోవచ్చని, పాత వారికి రెన్యువల్ చేయాలని కోరారు. దీనిపై సానుకూలంగా స్పందించిన ఛైర్మన్ అతిథి అధ్యాపకులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఆరేటి మహేష్, డాక్టర్ ప్రసాద్, దాస్, శిరీష, డాక్టర్ శ్రీను, డాక్టర్ భాను సురేంద్ర, నిశాంత్ పాల్గొన్నారు.

మహిళపై దాడి చేసిన వ్యక్తిపై కేసు

ఎంవీపీ కాలనీ : మద్యం సేవించి మహిళపై దాడికి పాల్పడిన వ్యక్తిపై ఎంవీపీ పోలీసులు కేసు నమోదు చేశారు. ఆరిలోవకు చెందిన సెరాల దుర్గను కుటుంబ కలహాల కారణంగా భర్త వదిలేశాడు. దీంతో ఆమె తన ఇద్దరు పిల్లలతో కలిసి 9 ఏళ్ల నుంచి యెడ్డు దేముడు అనే వ్యక్తితో కలిసి ఉంటుంది. కొంతకాలం వీరిద్దరూ బాగానే ఉన్నారు. అయితే గత కొంతకాలంగా దేముడు మద్యం సేవించి వచ్చి దుర్గతోపాటు ఆమె ఇద్దరు కొడుకులను చితకబాదుతున్నాడు. ఈ క్రమంలో రెండేళ్ల క్రితం ఆమె పిల్లలతో కలిసి హెచ్‌బీ కాలనీలోని తన అమ్మగారి ఇంటికి వచ్చేసింది. దీంతో ఈ నెల 13న దేముడు మద్యం సేవించి హెచ్‌బీ కాలనీ వచ్చి ఆమెపై కత్తితో దాడికి పాల్పడ్డాడు. ఈ నేపథ్యంలో ఆమె ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎంవీపీ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.